Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :7.816(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:8(7), August: 2021
Online Copy of Article Publication Available: www.ijmer.in
Digital certificate of publication: http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
*Article Received: 4th August*
*Publication Date:30th August 2021*

DOI: http://ijmer.in.doi./2021/10.08.144

# పెద్దింటి అశోక్ కుమార్ కథ 'ఎండమావి' – సమకాలీనత

**డా. రాపోలు శ్రీనివాస్**
తెలుగు సహాయాచార్యులు, తారా ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), సంగారెడ్డి, తెలంగాణా రాష్ట్రం.
సెల్: 9848050694 Email: srinivas.rapolu**42**@gmail.com

**వ్యాస సంగ్రహం:**

ఈ వ్యాసం, తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రముఖ నవలా, కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'ఎండమావి' కథలోని సమకాలీన సామాజిక అంశాలను విశ్లేషిస్తుంది. ఈ వ్యాసంలో తెలుగు కథా ప్రక్రియ పుట్టుక, లక్షణాలు, వివిధ రకాలు మరియు తెలుగు కథా చరిత్ర సంక్షిప్తంగా చర్చించబడ్డాయి. అలాగే, పెద్దింటి అశోక్ కుమార్ సాహిత్య ప్రస్థానం, ఆయన రచనలు మరియు పురస్కారాల విశేషాలు పొందుపరచబడ్డాయి. 'ఎండమావి' కథ ద్వారా తెలంగాణ పల్లెల్లో ఉపాధి కోసం విదేశాలకు (మస్కట్) వలసవెళ్లి, మధ్యవర్తుల మోసాల కారణంగా నిరుపేద కుటుంబాలు పడే ఇబ్బందులు, పేదరికం, కుటుంబ బంధాలు మరియు గ్రామీణ సామాజిక వాస్తవాలను ఈ వ్యాసం కళ్లకు కట్టినట్లు వివరిస్తుంది.

**కీలక పదాలు - తెలుగు కథ - పెద్దింటి అశోక్ కుమార్ - ఎండమావి కథ – వలసలు, మోసాలు – సమకాలీనత**

**ఉపోద్ఘాతం**

తెలుగు కథ తెలుగులో ఒక సాహితీ ప్రక్రియ. తెలుగు అకాడమి నిఘంటువు ప్రకారం కథ అనగా కొంత సత్యాంశతో కూడిన కల్పిత గద్య గ్రంథం. తెలుగులోను, ఇతర భారతీయ భాషలలో కొత్త కథ పుట్టి సుమారు నూరేళ్ళయింది. ఈ నూరేళ్ళలో సుమారు లక్షకు పైగా కథలు రచించబడినట్లుగా ఒక అంచనా. ఇవి ఎక్కువగా దిన, వార, మాస పత్రికలలో ప్రచురించబడుతున్నాయి. కొన్ని కథా సంకలనాలు ప్రత్యేకంగా ముద్రించబడుతున్నాయి. ఈ కథలు ముఖ్యంగా నీతి, ధర్మం, సాహసం, ఔదార్యం, శృంగారం వంటి విషయాలు ప్రధాన వస్తువుగా నడుస్తాయి. ఇతర సాహిత్య ప్రక్రియలన్నింటికన్నా కథకి ఆదరణ ఎక్కువ.

'జీవితంలోని ఒకానొక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్పనైపుణ్యంతో కళ్ళకు కట్టినట్లు చూపించి, హృదయాన్ని ఒక మహత్తరమైన అనుభూతితో నింపి, పదే పదే చదవాలనిపింపజేసేది గొప్ప కథ' - పోరంకి దక్షిణామూర్తి. 'ఒక కథను చదివిన తరువాత మనసు చలించాలి. మళ్ళీ చదివింపజేయాలి. ఈ కథ బాగుంది అని పదిమందికీ చెప్పించ గలగాలి. మళ్ళీ పదేళ్ళో, ఇరవై యేళ్ళో పోయిన తరువాత చదివినా అదే అనుభూతి, స్పందన కలగాలి. అప్పుడే అది గొప్ప కథ అవుతుంది' - వాకాటి పాండురంగారావు.

కథలలో రకాలు: పరిమాణాన్ని బట్టి పెద్ద కథ (నవలిక), కథానిక, మినీకథ, గల్పిక, స్కెచ్, పేజీకథ, కాలం కథ, కార్డు కథ; రంగాన్ని బట్టి సినిమా కథ, రేడియో కథ, పత్రిక కథ; ఇతివృత్తాన్ని బట్టి శృంగార కథ, ప్రేమకథ, హాస్య కథ, క్రైం కథ, రాజకీయ కథ, అభ్యుదయ కథ, విప్లవ కథ, స్త్రీవాద కథ, దళితవాద కథ;

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :7.816(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:8(7), August: 2021
Online Copy of Article Publication Available: www.ijmer.in
Digital certificate of publication: http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
*Article Received: 4th August*
*Publication Date:30th August 2021*

DOI: http://ijmer.in.doi./2021/10.08.144

ప్రాచుర్యాన్ని బట్టి పేదరాశి పెద్దమ్మ కథ, తెనాలిరామకృష్ణ కథ, చందమామ కథ, కాశీమజిలీ కథ, బేతాళ కథ, తాతమ్మ కథ, ఉబుసుపోక కథ, పిట్ట కథ; చెప్పే విధానాన్ని బట్టి హరికథ, బుర్రకథ, యక్షగాన కథ, భాగవత కథ వంటి పలు రకాలుగా కథలు ఉన్నాయి.

చరిత్ర: కథ అత్యంత ప్రాచీనమైన ప్రక్రియ. కల్పిత వృత్తాంతం కలిగినది కథ అని అర్థం. విజ్ఞానాత్మకమైన పంచతంత్ర కథలు మొదలు సాహస ఔదార్యాది గుణ వర్ణనాత్మకమైన విక్రమార్కకథలు, అద్భుతమైన భేతాళకథలు, వినోదాత్మకమైన పేదరాశిపెద్దమ్మకథలు, హాస్యభరితమైన తెనాలిరామలింగనికథలు పిల్లలను అలరిస్తూ వినోదాన్ని విజ్ఞానాన్ని అందించి వారు ఉత్తమగుణ సంపన్నులుగా ఎదగడానికి దోహదం చేస్తున్నాయి. కథలు పద్యరూపంలో రచింపబడితే వాటిని కథాకావ్యాలు అంటారు. కేతన కథా కావ్యరచనకు మార్గదర్శకుడు కాగా ప్రస్తుతం వచన రూపంలో వెలువడే కథలన్నిటికి కథాకావ్యాలే మార్గం వేసినట్లు చెప్పవచ్చు. లోకరీతిని, నీతిని వివరించే ఈ కథాకావ్యాలు సమకాలీన సాంఘిక చరిత్రకు ఆధారభూతమై తెలుగు సాహిత్య చరిత్రలో ప్రత్యేకమైన స్థానాన్ని ఆక్రమించాయి. బృహత్కథ తెలుగు నేల మీదనే ప్రభవించింది. కాని కథానిక, చిన్న కథ, కథ అనే ఆధునిక రూపాలలో అది కేవలం ఇరవయ్యవ శతాబ్దిలోనే రూపు దిద్దుకొన్న ప్రక్రియ.

కథ అనే ప్రక్రియ తెలుగులో తొలిసారిగా గురజాడ అప్పారావు రచించిన 'దిద్దుబాటు' కథను పేర్కొంటారు. బండారు అచ్చమాంబ, ఆచంట వేంకట సాంఖ్యాయనశర్మ వంటి వారు గురజాడకు ముందే తెలుగు కథకు శ్రీకారం చుట్టారు. అయినా కూడా అన్ని మంచి లక్షణాలు గల మొదటి కథగా "దిద్దుబాటు"ను గౌరవిస్తున్నారు. తొలి తెలుగు కథ మేరంగి సంస్థానానికి చెందిన ఆచంట వేంకట సాంఖ్యాయనశర్మ రాసిన "లలిత" అని ఒక అభిప్రాయం ఉంది. డా. భార్గవీరావు సంకలనం చేసిన "నూరేళ్ళ పంట"లో భండారు అచ్చమాంబ రాసిన "స్త్రీవిద్య" మొదటి కథగా ముందుకు వచ్చింది. అలాగే మాడపాటి హనుమంతరావు కథలు "మల్లికా గుచ్ఛము" పేరిట 1915లో ప్రచురితమయ్యాయి. కాని తెలుగు కథకు ఆద్యుడు గురజాడ అప్పారావు.

**పెద్దింటి అశోక్ కుమార్:** తెలంగాణా ప్రాంతానికి చెందిన ప్రసిద్ధ నవలా, కథా రచయిత. ఇతడు 1968, ఫిబ్రవరి 6 న రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం, భీముని మల్లారెడ్డిపేట గ్రామంలో జన్మించాడు. మల్లవ్వ, అంజయ్య ఇతని తల్లిదండ్రులు. ఇతడు ఇంటర్మీడియట్ గంభీరావుపేటలోను, బి.యస్సీ సిద్ధిపేటలోను ఎం.ఏ తెలుగు కాకతీయ విశ్వవిద్యాలయంలోను ఎం.ఎస్సీ గణితం నాగార్జున విశ్వవిద్యాల్యం లో చదివాడు. ఇల్లంతకుంట మండలం, రామాజీపేట గ్రామంలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కథ, నవలా రచయితగానే కాకుండా సినిమాలకు కథలు, మాటలు, పాటలు రాస్తూ సినిమా రచయితగా రాణిస్తున్నారు.

**రచనలు:** ఇతడు 1999లో రచనా వ్యాసంగం మొదలు పెట్టాడు. మొట్టమొదటి కథ "ఆశ- నిరాశ –ఆశ". ఇంతవరకు 200కు పైగా కథలు, 6 నవలలు, ఏడు కథా సంపుటాలు ప్రకటించాడు. ఇతని నవల జిగిరి హిందీ, ఇంగ్లీష్, మరాటీ, ఒరియా, పంజాబీ, కన్నడ, మైథిలి, బెంగాలి మొదలగు ఎనిమిది భారతీయ భాషలలోనికి అనువదించబడింది. దాగుడుమూత దండాకోర్ సినిమాకు మాటలు, మల్లేశం సినిమాకు

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :7.816(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:8(7), August: 2021
Online Copy of Article Publication Available: www.ijmer.in
Digital certificate of publication: http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
*Article Received: 4th August*
*Publication Date:30th August 2021*

DOI: http://ijmer.in.doi./2021/10.08.144

పాటలు, మాటలు వ్రాశాడు. దొరసాని, వేదం మరికొన్ని సినిమాలకి రచనా సహకారం చేసారు. ఎనిమిది చిన్న సినిమాలకు కథలు మాటలు అందించారు. 6 నాటికలు వంద వరకు వ్యాసాలు రాసారు. ఇతని తెగారం నాటకం నటనా విభాగంలో నంది బహుమతితో పాటు పాతిక అవార్డులను గెలుచుకుంది.

పెద్దింటి అశోక్‌కుమార్‌గారు తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారాలు, జిగిరి పుస్తకానికి 2015లో తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం, తెగారం నాటకం (పంతం పద్మనాభ కళాపరిషత్, కాకినాడ) అక్టోబరు 28, 2018 పురస్కారం పొందారు.

**ఎండమావి కథా ఇతివృత్తం:** తెలంగాణ ప్రాంతంలో ఏమాత్రం చేను, చెలకాలేక నివసించే రాములు-ఎల్లవ్వ నిరుపేద దంపతుల కథ ఎండమావి. దంపతులు ఇద్దరు కష్టజీవులు. కూలీపని చేసి జీవించేవారు. వారికి ఒక కూతురు ఉంది. రాములు మెతకమనిషి. ఎదుటి మనిషి ఆపదలో ఉంటే తన ప్రాణాల్ని కూడా లెక్క చేయడు. రాములు, ఎల్లవ్వ ఇద్దరు భార్యాభర్తలు రెక్కలు దాచుకోకుండా ఇంటి మనుషుల వలె పనిచేస్తారు. అందుకే పోచిరెడ్డి అత్యవసర పనిలో వారిని వదిలి పెట్టడు. ఎకరాలకు ఎకరాలు సంపాదించుకుని పుట్లకుపుట్లు ధాన్యాన్ని ఇంట్లో పోసుకునే పటేలు పోచిరెడ్డి. అందితే జుట్టును లేకుంటే కాళ్ళను పట్టుకుని అయినా పనిని పూర్తిచేసుకునేరకం.

ఎల్లవ్వ ఇరుగుపొరుగు వాళ్ళు మస్కట్ లాంటి బయటిదేశం పోయి రెండు మూడు యేండ్లు పనిచేసి సంపాదించుకుని వచ్చి ఊళ్లో హాయిగా ఉంటున్నారు. ఒక్కొక్కరు రెండుమూడుసార్లు పోయివస్తున్నరు. ఎంత కష్టంచేసినా ఇల్లు గడవకపోవడంతో వాళ్లను చూసి ఎల్లవ్వ రాములును కూడా మస్కట్‌కు పంపించాలనుకుని ప్రయత్నాలు చేస్తుంది. మస్కట్‌కు తోలించే యాదగిరి గురించి కనుక్కొనమని ఎల్లవ్వ పోచిరెడ్డికి అంతకుముందు చెప్పిపెట్టింది. ఎల్లవ్వను నారు పీకడానికి రెండురోజులు కూలికి రమ్మని అడగడానికి వస్తాడు పోచిరెడ్డి. కాని ఎల్లవ్వ తన పరిస్థితి కూలికి వచ్చేటట్లు లేదని చెబుతుంది. ఎల్లవ్వ అంతకుముందు తనకు చెప్పిన విషయం ప్రస్తావించి, ఆమెను కూలికి వచ్చేలా చేసుకుంటడు పోచిరెడ్డి. యాదగిరి తన అన్నకొడుకేనని తాను జమానతుపడితే బయటకు పంపిస్తానంటున్నాడని చెప్పి ఆశపెడతాడు. ఈ విషయం గురించి మాట్లాడొచ్చని ఎల్లవ్వ కూలి వస్తానని పోచిరెడ్డికి చెబుతుంది.

యాదగిరిని పిలిపించి పోచిరెడ్డి లొక్యంగా వ్యవహరిస్తూ అరవైవేలకు మస్కట్‌కు తోలేట్టు, పాస్‌పోర్ట్‌తో అడ్వాన్సుగా పదివేలు ఇచ్చేట్లు మాట్లాడతాడు. ఎల్లవ్వ ఇంటిని కుదువపెట్టి పదివేల రూపాయలు అప్పుతెచ్చి ఇచ్చింది. రెండు నెలల తిరగకముందే యాదగిరి వీసాతో ప్రత్యక్షమైయ్యాడు. ఎల్లవ్వ ఎంతో సంతోషిస్తుంది. ఈ విషయం తెలిసి వచ్చిన బంధు మిత్రులందరికి కల్లు, కూరతో మంచి విందు ఇస్తుంది ఎల్లవ్వ. యాదగిరితో కలిసి రాములు ముంబాయి బస్ ఎక్కాడు. ముంబాయిలో దిగగానే మెడికల్ ఫెయిల్ రిపోర్టు వచ్చిందని అదనంగా ఐదువేలు తీసుకుంటాడు యాదగిరి. రాములుకు ఒక ఇరుకైన గదిని అద్దెకు కుదురుస్తాడు. వారం రోజుల తరువాత యాదగిరి కనిపించడం మానేశాడు. రాములు ఆఫీసువారితో గొడవపడి, చివరికి తన విషయం చెప్పి బతిమాలితే మస్కట్ పోవడానికి ఇంకా నెలరోజులు పడుతుందని చెబుతారు.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :7.816(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:8(7), August: 2021
Online Copy of Article Publication Available: www.ijmer.in
Digital certificate of publication: http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 4th August
Publication Date:30th August 2021

DOI: http://ijmer.in.doi./2021/10.08.144

రాములు విషయం తెలుసుకుని బాధపడతాడు. వెంటతెచ్చుకున్న డబ్బులు అయిపోయాయి. తిండి తినడానికి కూడా డబ్బులేదు. లేబర్ అడ్డ దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు. బిల్డింగ్ కాంట్రాక్టర్‌వద్ద కూలీపని దొరికింది. అతి కష్టంమీద నెలరోజులు గడుస్తాయి. ఒకరోజు ఉదయం యాదగిరి నవ్వుకుంటూ రాములు గదికి వచ్చాడు. యాదగిరిని చూడగానే రాములు పట్టరాని కోపంతో అరుస్తూ మీదికి పోతాడు. కాని, యాదగిరి రాములుతో "నీ అదృష్టం బాగుంది, నీకు మంచి కంపెనీ దొరికింది. రోడ్డుమీద కాగితాలు ఏరే మున్సిపాలిటీ పని. పదివేలు జీతం. ఇష్టమున్నన్ని రోజులు అక్కడ ఉండొచ్చు. ఇంటికి వచ్చేటప్పుడు నాలుగు నెలలు జీతంతోకూడిన సెలవులుకూడా ఇస్తా"రని ఆశ పెడుతూ మాట్లాడతాడు. నీతోపాటు ఇంకో పదిమంది వస్తున్నారని, ఎయిర్‌పోర్టులో దిగగానే కంపెనీకారు ఉంటుందనీ, ఒనరే స్వయంగా వచ్చి తీసుకుపోతాడని యాదగిరి చెప్పి, ఫ్లైట్ ఎక్కించాడు.

మస్కట్‌లో దిగిన రాములును తీసుకుపోవడానికి ఎవరూ లేరు. చాలా సేపటిదాకా ఎవరూ రాలేదు. ఏదో మోసం జరిగిందన్న అనుమానం మొదలైంది రాములుకు. అక్కడున్నవాళ్లకు తన పాస్‌పోర్టు, వీసా, టికెట్ అన్నీ చూపించాడు. వారు అవి చూసి అరబ్బీలో ఏదో మాట్లాడుకున్నారు. కొద్ది సేపటి తర్వాత ఒక ఆటోవచ్చి రాములు ఎయిర్‌పోర్టు నుండి తీసికెళ్లి సిటీ మధ్యలో దించేస్తుంది. రాములు ఎక్కడికి పోవాలో తెలియక అక్కడి విశాలమైన రోడ్లపై తిరుగుతూ ఉంటాడు. అప్పుడు ఒక కారు కీచుమని శబ్దం చూస్తూ పక్కనే ఆగుతుంది. అందులో తన ఊరివాడే అంజయ్య కనిపిస్తాడు. అంజయ్య కారు దిగి రాములును కౌగిలించుకుని కారు ఎక్కించుకుంటాడు. రాములు ఏడుస్తూ తనకు జరిగిన మోసం వివరిస్తూ డ్రైవర్ సీట్లో ఉన్న షేక్‌కి చూపించి విషయం తెలుసుకుంటాడు. "రాములూ, నిన్ను యాదిగాడు మోసం జేసిండురా. ఇది విజిటింగ్ వీసా. మూడు నెలలు మాత్రమే నీవు ఈ దేశంలో ఉండాలె. కంపినీ లేదు, పని లేదు. కూలి చేసుకోవాలి. లేనినాడు వట్టిగనే ఉండాలి. ఏదైన పనిమీద వచ్చేవారు తీసుకునేది విజిటింగ్ వీసా" అని అంజయ్య జరిగిన మోసాన్ని వివరించాడు. అది విని రాములు ఒక్కసారిగా బావురుమన్నాడు. అంజయ్యకు జాలివేసింది. "నువ్వేం భయపడకురా. ఇటువంటి వీసాలున్నవారు చాలా మందే ఉన్నారు ఇక్కడ. నాకు ఇక్కడ తెలిసిన కంపెనీలో ఎవరితోనైనా మాట్లాడి నీకు పని ఇప్పిస్తా. కనీసం నువ్వు ఇల్లు అమ్ముకున్న డబ్బు మందం సంపాయించుకోవచ్చు" అని ధైర్యం చెప్పి ఓదారుస్తాడు అంజయ్య.

## సమకాలీన అంశాలు

తెలంగాణ ప్రాంతంలో వలసలు చాలా కాలం నుండి ఉన్నాయి. ఇప్పటికీ ఉన్నాయి. కుటుంబ సభ్యులకు ఏమీ చేయలేక పోతున్న అపరాధ భావన ఇక్కడి ప్రజలలో ఉంటుంది. తాను కష్టపడైనా తల్లిదండ్రులను, భార్యాబిడ్డలను సుఖపెట్టాలని భావిస్తారు. అందుకోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడతారు.

ఈ కథలో రాములు కుటుంబం కూడా అలాంటిదే. భార్య ఒత్తిడి, ఇరుగుపొరుగువారు మస్కట్ వెళ్లివచ్చి బాగుపడడం చూసి ఎలాగైనా వెళ్లాలని, అందుకోసం ఇల్లుసైతం అమ్మడానికైనా వెనుకాడరు. తన భార్య, కూతురు కోసం మస్కట్ పోవడానికి తయారవుతాడు. ఏమాత్రం చదువులేని రాములు యాదగిరి మోసానికి గురై అనేక బాధలు అనుభవిస్తాడు.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :7.816(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:8(7), August: 2021
Online Copy of Article Publication Available: www.ijmer.in
Digital certificate of publication: http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
*Article Received: 4th August*
*Publication Date:30th August 2021*

DOI: http://ijmer.in.doi./2021/10.08.144


తెలంగాణ పల్లెల్లో ధనవంతులు, భూస్వాములు తమ వ్యవసాయ పనులు చేయించుకోవడానికి నమ్మకస్తులైన కూలీలకు సహాయం చేస్తున్నట్లు ఆశపెట్టి లొంగదీసుకుంటారు. ఈ కథలో పోచిరెడ్డి మస్కట్‌కి తోలించే యాదగిరి తన అన్నకొడుకేనని చెప్పి బేరం కుదిరిస్తాడు. ఊళ్లో ఉండే పెద్దమనుషుల ద్వారా వ్యవహారాలు నడిపిస్తే సవ్యంగా జరుగుతాయనే నమ్మకం సహజంగా పేదవాళ్ళలో ఉంటుంది. అలాగే ఎల్లవ్వ కూడా పోచిరెడ్డిని యాదగిరితో మాట్లాడడానికి తీసుకువచ్చి అతని సమక్షంలో వ్యవహారం నడిపిస్తుంది.

ఎన్నో రోజులుగా అనుకున్న పని జరుగుతున్నప్పుడు మనసులో ఆనందం కలుగుతుంది. తమ ఆనందాన్ని నలుగురితో పంచుకుంటారు. మస్కట్ వెళ్లాలనే తన కోరిక తీరడం, దానికి కావలసిన వీసా రావడంతో ఎల్లవ్వ సంతోషంతో తమ ఇంటికి వచ్చిన బంధువులకు, స్నేహితులకు కల్లు, మాంసంతో విందు ఏర్పాటు చేస్తుంది.

తమ ఆశయం నెరవేర్చుకోవడానికి ఎంతటి పనైనా చేస్తారు మనుషులు. దానివల్ల వారికి సంతోషమేకానీ బాధ కలుగదు. మస్కట్ వెళ్లడానికి కావలసిన ఖర్చులకు తన ఇంటిని అమ్మేస్తుంది ఎల్లవ్వ. తన తల్లిదండ్రులనుండి వచ్చిన ఇల్లు అమ్మడం రాములుకు ఇష్టంలేదు. ఇల్లు అమ్మడం నామోషీగా అనిపించింది. ఎంతో పెద్ద ఆపదవస్తేకాని ఇల్లు అమ్ముకోరు. రాములు తన ఇంటి ఖాళీస్థలంలో మరోపెద్ద ఇల్లు కట్టాలని కలలు కనేవాడు. ఆ కలలు తీరకుండానే ఇల్లు అమ్ముడుపోవడం బాధ అనిపించింది. ఇంటి గురించి ఆలోచించడం, మమకారం పెంచుకోవడం, అలాంటి ఇల్లు అమ్ముకోవడం నామోషీగా భావించడం ఇప్పటికి పల్లెల్లో కనిపిస్తుంది.

ఎదుటివారి అమాయకత్వాన్ని ఆసరా జేసుకుని మోసం చేయడం, డబ్బు గుంజడం నేటి సమాజంలో కూడా ఉంది. రాములు ముంబయిలో ఒక ఇరుకైన అద్దెగదిలో ఇదివరకే అందులో ఉన్న ముగ్గురితో ఉంటాడు. ఐదు రూంలకు కలిపి ఒకటే లాట్రిన్, కాలకృత్యాలు తీర్చుకోవడాని అర్ధగంట వేచివుండాల్సిన దుర్భర పరిస్థితి. ముంబయిలో తమను మస్కట్‌కు పంపించే ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాడు. వాళ్ళతో గొడపడి, బతిమాలితే చివరికి "వీసా ఒకే అయింది, ఎమర్జేషన్ కాలేదు. నెలరోజులు పడుతుందని" చెప్పారు. శ్రమజీవి అయిన రాములు ఊరుమొహం చూడొద్దని ఎలాగైనా ఈ నెల రోజులు ఇక్కడే ఉండాలని నిర్ణయించుకుని మొండి పట్టుదలతో ఉంటాడు. బిల్డింగ్ కాంట్రాక్టర్ దగ్గర కూలీపనికి కుదిరి పనిచేస్తూ ఉంటాడు. పనిని మధ్యలో విడిచిపెట్టకుండా ఎలాంటి కష్టాలు వచ్చినా భరిస్తూ పనిపూర్తి చేసుకునిపోవాలన్న పట్టుదలతో రాములు లాంటివారు ఇప్పటికిని ఉన్నారు.

తనను ముంబయిలో విడిచిపెట్టిపోయి నెలరోజుల తరువాత తన గదికి వచ్చిన యాదగిరిని చూసి అక్కడికక్కడే నరికి పోగులు పెట్టాలన్నంత కోపం వస్తుంది. ఆవేశంతో అతడిపై విరుచుకుపడతాడు. కాని మంచి కంపెనీ పనిదొరికిందని, పదివేలు జీతమనీ, ఇష్టమున్నన్ని రోజులు అక్కడ ఉండొచ్చని, తిరిగి వచ్చేటప్పుడు రిటర్న్‌వీసా, నాలుగునెలల సెలవులు ఇస్తారని చెప్పడంతో రాములు కోపం చల్లారింది. తనవాడే తనను మోసం చేశాడని తెలిసి కోపంతో రాములులాగా ఊగిపోవడం, కోపంతో ఉన్న వాడిని


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :7.816(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:8(7), August: 2021
Online Copy of Article Publication Available: www.ijmer.in
Digital certificate of publication: http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
*Article Received: 4th August*
*Publication Date:30th August 2021*

DOI: http://ijmer.in.doi./2021/10.08.144

తనవైపుకు తిప్పుకోవడానికి ఎన్నో ఆశలు కల్పించి చెప్పి శాంతపరిచే యాదగిరిలాంటి మధ్యవర్తులు సమాజంలో నేటికి కన్పిస్తారు.

మస్కట్ ఎయిర్‌పోర్ట్‌లో దిగిన రాములుకు యాదగిరి చెప్పినట్లు తనను తీసుకుపోవడానికి కంపినీకారుగానీ, మనుషులుగానీ ఎవరూ కనిపించరు. తనకు మోసం జరిగిందని తెలుసుకుని ధైర్యాన్ని కూడగట్టుకుని పాస్‌పోర్టును అక్కడున్న వ్యక్తులకు చూపిస్తాడు. తరువాత ఒక ఆటో రాములును ఎయిర్‌పోర్టునుండి తీసుకుపోయి సిటీమధ్యలో వదిలేస్తుంది. అక్కడి రోడ్లపై నడుస్తున్న రాములు పక్కనే కారు ఆగుతుంది. అందులో ఉన్న తన ఊరివాడు అంజయ్య రాములును గుర్తుపట్టి కారు ఎక్కించుకుని విషయం తెలుసుకుంటాడు. యాదగిరి మూడునెలలు మాత్రమే చెల్లే విజిటింగ్ వీసా ఇప్పించాడనీ, మోసం చేశాడని చెప్పి ఓదారుస్తాడు. తనకు తెలిసిన వాళ్ళతో మాట్లాడి పని ఇప్పిస్తానని భరోసా ఇస్తాడు. పరాయి దేశంలో తన ఊరువాడు కనిపించినప్పుడు ఆదరించి, అన్నిరకాలుగా అండగా ఉండడం తెలంగాణ ప్రజలకు సాటి మనుషుల పట్ల ఉండే మమకారం, ప్రేమభావాలకు నిదర్శనం. ఇప్పటికీ సమాజంలో కనిపిస్తుంటుంది.

ఈ విధంగా వలసపోయి మోసాలకు గురై ఎన్నో బాధలు అనుభవించే రాములు కథే 'ఎండమావి'. ఈ కథలో నేటి సమాజంలోని ఎన్నో సమకాలీన, సామాజిక అంశాలు ప్రతిబింబిస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు:**

1. జిగిరి (నవల), పెద్దింటి అశోక్ కుమార్, నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2015.
2. నూరేళ్ళ పంట (కథా సంకలనం), డా. భార్గవీరావు (సంపాదకులు), సాహిత్య ప్రచురణలు, 2001.
3. మల్లికా గుచ్ఛము, మాడపాటి హనుమంతరావు, నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1915.
4. అగ్నిపురాణం (కథానిక లక్షణాల ప్రస్తావన), వేదవ్యాస మహర్షి, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2008.